క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

గజ్వేల్: డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈ ఆర్.భాను ప్రకాశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 132/32కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు బంగ్లా వెంకటాపూర్, అహ్మదీపూర్, ధర్మారెడ్డిపల్లి, సింగాటం, బెజుగామ, మజీద్‌పల్లి, నెంటూర్, బేగంపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్‌లు



సర్టిఫికెట్‌లతో విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 48మంది ఎన్‌సీసీ విద్యార్థినులకు హెచ్‌ఎం మనోహర్ బుధవారం సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు కరీంనగర్ పరిధిలోని ఎన్‌సీసీలో శిక్షణ పొందారన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి ఉదయశ్రీ, హవల్దార్ హకీంసింగ్, ఉపాధ్యాయులు కోటగిరి ప్రభు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులతో రాజలింగం, కిరణ్‌కుమార్

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన పది మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.3లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందన్నారు. లబ్ధిదారులు స్వామి, మంజుల, శిరీష, జ్యోతి, విజయ, ఎల్లవ్వ, కనకయ్య, దశమంత్‌రెడ్డి, కిష్టయ్య, సౌందర్య, నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్, రవిచందర్, బాలరాజు, సత్యం, డానియల్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలుగా గుర్తించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న బైండ్ల కులస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): బైండ్ల కులస్తులు ఏకసభ్య కమిషన్ చైర్మన్ డా.జస్టిస్ షమీమ్ అక్తర్‌ను కలిసి తమ కులాన్ని వెనుకబడిన కులంగా గుర్తించాలని వినతిపత్రం అందజేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణేశ్ మాట్లాడుతూ ఆరు లక్షల జనాభా కలిగిన బైండ్ల కులానికి న్యాయం చేయాలన్నారు. గ్రామ దేవతల పూజారులు, పంబాల, కొలుపులు, పోతరాజులను ఎస్సీ –ఏ జాబితాలో చేర్చి రిజర్వేషన్‌లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు భరత్, రాంబాబు, కుమారస్వామి, సుధాకర్, రాజు తదితరులు ఉన్నారు.

పోస్టాఫీస్ తరలించొద్దు



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్త్యాల గ్రామంలో ఉన్న సబ్ పోస్టాఫీస్‌ను తరలించవద్దంటూ గ్రామస్తులు బుధవారం స్థానిక పోస్టాఫీస్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు పది గ్రామాల ప్రజలకు నలభై యేళ్లుగా సేవలందిస్తున్న సబ్ పోస్టాఫీస్ తరలింపును విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి, గ్రామస్తులు గిరిధర్, భూమయ్య పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి నాలుగు రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 22మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి బుధవారం వారికి రూ.41వేల జరిమానా విధించారు.

యాజమాన్య పద్ధతులే శరణ్యం



సాక్షి, సిద్దిపేట: చలి ప్రభావంతో వరి ముదురు ఆకులు పసుపురంగులోకి మారి నారు ఎదుగుదల లోపిస్తుంది. రాత్రి సమయంలో నీటిని ఉంచి ఉదయాన్నే కొత్తనీరు పెట్టాలి. చలి తీవ్రత ఎక్కువైన సందర్భాల్లో 19:19:19 5గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నారు ఎదగడానికి కార్బండాజిమ్, మ్యాంకోజెబ్ 2.5గ్రాములు ఒక కిలో యూరియాతో కలిపాలి. పొద్దుతిరుగుడులో పచ్చపురుగును గమనిస్తే ఇమామెక్టిన్ బెంజోయేట్, నొవాల్యురాన్ 320 మిల్లీ లీటర్లు, 19:19:19 ను 500గ్రాములు కలిపి ఎకరాకు 200 లీటర్ల నీటితో బొడ్డెతో పాటు మొక్క తడిచే విధంగా పిచికారీ చేయాలి. మొక్కజొన్నలో కాండం తొలిచే పురుగు, కత్తెర పురుగు ఉంటే 0.4మిల్లీ లీటర్లు, క్లోరాంట్రనిలీపోల్ కలిపి పిచికారీ చేయాలి. శనగలో పచ్చ రబ్బరు పురుగు నివారణకు థయోడికార్బ్ 1.0గ్రాలను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



– డాక్టర్ పల్లవి, శాస్త్రవేత్త

పాల ఉత్పత్తి తగ్గే అవకాశం



సాక్షి, సిద్దిపేట: చలి కారణంగా పశువుల్లో శ్వాసకోశ వ్యాధులు వస్తాయి. రోగ నిరోధక శక్తి తగ్గడంతోపాటు పాల ఉత్పత్తి తగ్గుతుంది. వాటిని నివారించేందుకు రాత్రి సమయాల్లో షెడ్లలో ఉంచి పరదాలు కట్టాలి. ఉదయం, రాత్రి చల్లటి నీటిని తాగించొద్దు. గొంతు, పేగులకు ఇన్ఫెక్షన్‌లు వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయి. పాడి పశువులకు నూనె సంబంధిత పదార్థాలు దాణా ఎక్కువగా ఇవ్వాలి. పొదుగు ఎండిపోయే అవకాశం ఉంటుంది కాబట్టి కొబ్బరి నూనె రాయాలి. బలహీనంగా ఉన్న పశువులపై శ్రద్ధ తీసుకోవాలి. గడ్డి ఎప్పుడు పొడిగా ఉండే విధంగా చూడాలి. పశువులకు కాల్షియం, మినరల్ మిక్షర్ ఇవ్వాలి. దోమల బెడద నుంచి రక్షించడానికి వేపాకు పొగవేయాలి.



– డాక్టర్ కొండల్‌రెడ్డి, ఏడీ, పశుసంవర్ధక శాఖ

ఆగుతూ.. సాగుతూ..

- నత్తనడకన రోడ్డు నిర్మాణం
- ప్రభుత్వం మారినా ఫలితం లేదు
- వాహనదారుల ఇబ్బందులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మూడు జిల్లాల సరిహద్దు గ్రామం. నిత్యం వందల కొద్దీ వాహనాల రాకపోకలు. రవాణాకు సరైన మార్గం. అందుకే డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.7కోట్ల నిధులు మంజూరు చేసింది ప్రభుత్వం. కాని నిర్మాణ పనుల్లో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో అటు వాహనదారులు, ఇటు గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం మారినా ఫలితం కనిపించడంలేదు.

జగదేవ్‌పూర్ మండలంలోని వట్టిపల్లి మూడు జిల్లాలకు సరిహద్దు గ్రామం. జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాలకు సరిహద్దుగా ఉండడం వల్ల వట్టిపల్లి మీదుగా నిత్యం వందలాది వాహనాలు నిత్యం హైదరాబాద్, సిద్దిపేట రాజీవ్ రహదారి వైపు వెళ్తుంటాయి.



వట్టిపల్లిలో డబుల్ రోడ్డు

డబుల్ రోడ్డు నిర్మాణానికి..

అంతకు ముందు సింగిల్ రోడ్డు ఉండడం వల్ల గత ప్రభుత్వం డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.7కోట్లు మంజూరు చేసింది. నిధులు మంజూరు అనంతరం ఎన్నికలు రావడం వల్ల నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. మూడు నెలల క్రితం రవాణాశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మాజీ సర్పంచ్ మాధవిరాజిరెడ్డితో పాటు గ్రామస్తులు కలిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని వినతిపత్రం అందజేశారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం సదరు కాంట్రాక్టర్ గ్రామ శివారు నుంచి రోడ్డుకు రెండు వైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించే పనులు ప్రారంభించి మట్టి పోశారు. గ్రామ సమీపం వరకు పనులు చేపట్టినా అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో వాహనదారులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.

> **పనులు వేగవంతంగా సాగేలా చూస్తాం..**
>
> వట్టిపల్లి నుంచి సాల్వపూర్ రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోందన్న మాట వాస్తవమే. నిర్మాణ పనుల్లో వేగం పెంచేలా చర్యలు తీసుకుంటాం. వాహనదారులకు ఇబ్బందులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటాం.
>
> – వెంకటేశం, ఆర్‌అండ్‌బీ డీఈ

కఠినంగా వ్యవహరిస్తేనే డ్రగ్స్ నిర్మూలన

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక

మిరుదొడ్డి(దుబ్బాక): పోలీసు అధికారులు చట్టప్రకారం కఠినంగా వ్యవహరిస్తేనే డ్రగ్స్ నిర్మూలన సాధ్యపడుతుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక అన్నారు. రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని కాసులాబాద్‌లో డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రగ్స్ కల్చర్‌ను యువకులు సమష్టిగా తిప్పికొట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాలకు రహస్యంగా వస్తున్న డ్రగ్స్ మహమ్మారిని సమూలంగా అరికట్టడానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్ ఆర్గనైజర్ తోట కమలాకర్‌రెడ్డి, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధి నునిగాని రాజు, నైపుణ్య ఆర్గనైజేషన్ చైర్మన్ ఐలయ్య, నాయకులు సూకూరి లింగం, వల్లాల సత్యనారాయణ, తుమ్మల బాల్‌రాజు, ఎండీ అహ్మద్, బాలాగౌడ్, భైరయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం 2కే రన్‌లో విన్నర్లుగా నిలిచిన విజేతలకు మెడల్స్‌ను బహూకరించారు.



2కే రన్‌లో పాల్గొన్న కత్తి కార్తీక

జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ నేత గోపాలస్వామి

సిద్దిపేటరూరల్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఆర్పీలను రెగ్యులరైజ్ చేసి, జీఓ నంబర్ 60 ప్రకారం కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్ చేశారు. ఆర్పీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించి ఏఓ రెహమాన్, మెప్మా పీడీకి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 6వేల మంది ఆర్పీలు అనేక రకాలుగా కృషి చేస్తున్నారన్నారు. కాని వారికి రూ.6వేలు మాత్రమే ఇవ్వడం దారుణమని వాపోయారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు రవికుమార్, సుభద్ర, కవిత, పద్మ, లత, మనోహరి, శ్యామల, పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

గజ్వేల్: మెప్మా రిసోర్స్ పర్సన్లకు జీఓ ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ మెప్మా ఆర్పీల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సుభద్ర గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గొల్కొండ నర్సయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన పథకాలను వారి దరికి చేర్చడంలో కృషిచేస్తున్న ఆర్పీలకు కనీస వేతనాలు అమలు చేయకపోవడం సరికాదన్నారు. ఎల్లయ్య, కల్పన, పద్మ, ఫాతిమా, మనోహరి, లావణ్య, సుధారాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన



నాట్లు వేస్తూ అవగాహన కల్పిస్తున్న ఏఈఓ శ్రీలత

- ఏఈఓ శ్రీలత

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల పరిధిలోని రామవరంలో నాట్లు వేస్తున్న ఎడబోయిన లింగారెడ్డి పొలాన్ని ఏఈఓ కరంటోతు శ్రీలత బుధవారం సందర్శించారు. నాట్లువేసే సమయంలో ఎరువుల వినియోగం, కలుపు యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాలుగు నుంచి ఆరు ఆకులు ఉన్న నారును ఉపయోగించాలని, ముదురు నారు నాటితే దిగుబడి తగ్గుతుందని చెప్పారు. గడ్డి జాతి కలుపు నివారణకు బ్యూటక్లోర్ 50శాతం మందును 1–1.5లీటర్ల నీటిలో లేదా అనిలో ఫాస్ట్ 30శాతం మందును 1.5–2లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు 25కిలోల పొడి ఇసుకలో కలిపి నాటిన మూడు రోజుల నుంచి ఐదు రోజులలో పలుచగా నీరుపెట్టి సమానంగా వెదజల్లుకోవాలని సూచించారు. గడ్డి, వెడల్పాటి ఆకులు ఉన్నప్పుడు బ్యూట క్లోర్ 5శాతం గుళికలను 20 కిలోల పొడిఇసుకలో కలిపి నాటిన మూడు నుంచి ఐదు రోజుల్లో వాడుకోవాలని శ్రీలత సూచించారు.

సస్యరక్షణ చర్యలు తప్పని సరి

తొగుట(దుబ్బాక): వరి నారుదశలో ఉన్నప్పుడు సస్యరక్షణ చర్యలు తప్పని సరి అని మండల వ్యవసాయ అధికారి నాగార్జున అన్నారు. మండల పరిధిలోని పెద్దమాసాన్‌పల్లి, బండారుపల్లిలో వరి నారును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి కల్యాణ ఆహ్వాన పత్రికను ఆలయ అధికారులు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి బుధవారం హైదరబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఆలయ ఈఓ బాలాజీ, ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.

'ఆయిల్‌పామ్'తో అధిక లాభాలు

దుబ్బాకటౌన్: ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు పొందవచ్చని మండల ఉద్యాన అధికారి రమేశ్ సూచించారు. రాయపోల్ మండలం ఆరేపల్లిలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు, రాయితీలు ఇస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 11వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగులో ఉందని చెపచెప్పారు. ఆయన వెంట ఏఈఓ ప్రవీణ్, రైతులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాకటౌన్: కేంద్ర ప్రభుత్వ సంస్థ (సీఎస్ఐఆర్) ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ హైదరాబాద్ ఉప్పల్ సంస్థలో ఐటీఐ పూర్తిచేసిన వారికి ఉద్యోగ భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన వారు httpr//iict.rer.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 84990 84414 నంబర్‌ను సంప్రదించగలరని కోరారు.

మత్స్యకారులకు స్కిల్ టెస్టులు

తొగుట(దుబ్బాక): మల్లన్న సాగర్‌లో పోలీస్ బందోబస్తు మధ్య అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ ముదిరాజ్ మత్స్యకార్మికులకు బుధవారం జిల్లా మత్స్యశాఖ అధికారి వరదరెడ్డి నేతృత్వంలో స్కిల్ టెస్టులు నిర్వహించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఖాజీపూర్ గ్రామానికి చెందిన 40 మందికి స్కిల్ టెస్టులు నిర్వహించినట్లు మత్స్యశాఖ అధికారి తెలిపారు. కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, జిల్లా సొసైటీ డైరెక్టర్ సత్తయ్య, ముదిరాజ్ సంఘం నాయకులు సాయి, శ్రీను, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

గజ్వేల్‌రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ మురళి హెచ్చరించారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 16మంది పట్టుపడ్డారు. వారిని విచారించిన జడ్జి ప్రియాంక రూ.8వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం

హుస్నాబాద్‌రూరల్: మున్సిపాల్టీ పాలకవర్గ సమావేశం చైర్‌పర్సన్ రజిత అధ్యక్షతన బుధవారం జరిగింది. పట్టణంలో చేపట్టే పలు అభివృద్ధి పనులపై సభ్యులు చర్చించారు. సభ్యుల లామోదం మేరకు తాగునీటి సరఫరాకు పైపులైన్ల మరమ్మతులు, మోటార్ల రిపేర్ల కోసం రూ.4.90లక్షలు; ఎల్లమ్మ చెరువు కాల్వలోని చెట్ల పొదలు తొలగించేందుకు రూ.3.96లక్షలు, ఆర్టీఓ కార్యాలయం దగ్గర వైకుంఠధామం నిర్వహణను మూడేళ్ల పాటు ఆదిజాంబవ సంక్షేమ సంఘానికి కేటాయింపు లాంటి 26 అంశాలపై సభలో చర్చించి తీర్మానించినట్లు కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. సమావేశంలో వైస్‌చైరపర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్స్ భాగ్యరెడ్డి, చిత్తారి పద్మ, దొడ్డి శ్రీనివాస్, వాల సుప్రజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రజిత

చట్టాలపై అవగాహన అవసరం

గజ్వేల్‌రూరల్/నంగునూరు(సిద్దిపేట): విద్యార్థినులకు చట్టాలపై అవగాహన అవసరమని సీఐ సైదా పిలుపునిచ్చారు. గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ఆర్ అండ్‌ఆర్ కాలనీలోని పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ సీఐ మురళితో కలిసి బుధవారం ఆయన గుడ్ అండ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, షీ టీమ్, మహిళల రక్షణకు ఉన్న చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా అక్కెనపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు నంగునూరు రూరల్ సీఐ శ్రీను అవగాహన కల్పించారు. అపరిచితులు, ఆన్‌లైన్‌లో పరిచయమైన వారితోను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జానయ్య, షీటీమ్ సభ్యులు కిషన్, మమత, ప్రవీణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పైకప్పు తొలగింపు



నిన్న వేలాడుతూ..



నేడు ఇలా..

సాక్షి ఎఫెక్ట్..

వర్గల్(గజ్వేల్): స్థానిక జెడ్పీ హైస్కూల్ వద్ద కిటికీ పైకప్పు ప్రమాదకరంగా వేలాడుతున్న విషయాన్ని 'ఒరిగిన పైకప్పు' శీర్షికతో మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి హెచ్‌ఎం వెంకటేశ్ గౌడ్ స్పందించారు. ఒరిగిన పైకప్పును బుధవారం తొలగింపజేసి ముప్పు నివారించారు.

డ్రైనేజీలు నిర్మిస్తాం



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

మర్కూక్(గజ్వేల్): మండలంలోని పాములపర్తిలో డ్రైనేజీలను అధికారులు బుధవారం పరిశీలించారు. ఇటీవల సాక్షిలో ప్రచురితమైన 'పడకేసిన పారిశుద్ధ్యం' కథనంపై వారు స్పందించి గ్రామంలో రోడ్లపైకి వస్తున్న మురుగు నీరు, సీసీ రోడ్లను పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ త్వరలోనే కాలువ నిర్మిస్తామన్నారు.

పరిష్కరించే వరకు సమ్మె ఆగదు

- 8వ రోజుకు 'సమగ్ర' శిక్షా సమ్మె
- హైమావతి మృతికి సంతాపం

సిద్దిపేటరూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె ఎనిమిదో రోజుకు చేరింది. అందులో భాగంగా ఉద్యోగ సంఘం నేతలు బుధవారం మాట్లాడుతూ ప్రభుత్వం తమ డిమాండ్లు, సమస్యలను పరిష్కరించేంత వరకు శాంతియుతంగా సమ్మె కొనసాగిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామన్నారు. నిరసనలో పాల్గొన్న ఖమ్మం జిల్లాకు చెందిన హైమావతి గుండెపోటుతో మృతి చెందడంతో మౌనం పాటించారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని ముస్తాబాద్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలిపిన టీఎస్‌యూటీఎఫ్ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ తమ వంతుగా ప్రభుత్వానికి వినతిపత్రం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, ప్రధాన కార్యదర్శి నవీన్, కోశాధికారి కరుణాకర్, రాష్ట్ర నాయకులు సురేందర్, కృష్ణవేణి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పేకాటరాయుళ్ల అరెస్టు

కొండపాక(గజ్వేల్): పేకాడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. గ్రామ శివారులోని రైస్‌మిల్ సమీపంలో గ్రామానికి చెందిన నలుగురు పేకాడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి పటుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,720లతో పాటు మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సిద్దిపేటకమాన్: రెండు రోజుల క్రితం ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన సిద్దిపేటలో బుధవారం చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. రెండు రోజుల క్రితం డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద ఓ వ్యక్తి అనారోగ్యంతో రోడ్డుపై పడి ఉన్నాడని సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది అతడిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అతడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచారని, వయసు 50 నుంచి 55యేళ్ల మధ్య ఉంటుందని సీఐ తెలిపారు. మరిన్ని వివరాలకు 87126 67314 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

◆ ఇసుక డంప్ సీజ్

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో అక్రమంగా నిలువ చేసిన ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని గాగిల్లాపూర్ శివారులోగల మోయతుమ్మెద వాగు నుంచి ఇసుకను బెజ్జంకి తరలించారు. డంప్ నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

◆ ఇన్నోవేషన్ పార్కుకు స్థల పరిశీలన

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని సముద్రాల గ్రామంలో ఇన్నోవేషన్ పార్కు నిర్మాణం కోసం ఆర్డీఓ రామ్మూర్తి స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సురేఖ, ఆర్ఐ సురేందర్ ఉన్నారు.

◆ సమస్యలు పరిష్కాంచాలి

దుబ్బాకటౌన్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య హెచ్చరించారు. రాయపోల్ ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలన్నారు. వెంకటచారి, బాబు, యాదగిరి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

◆ అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

చేర్యాల(సిద్దిపేట): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని కడవేర్గు కాంగ్రెస్ నాయకులు చెప్పారు. గ్రామంలో జరుగుతున్న సర్వేలో బుధవారం వారు పాల్గొన్నారు. పేదలందరికీ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నాయకులు బాలచంద్రం, వినీత్‌బాబు, రమేశ్, విజయ్, నరేందర్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

◆ కరపత్రాల ఆవిష్కరణ

బెజ్జంకి: దళిత హక్కుల ఉద్యమం రెండో వార్షిక మహాసభలకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బెజ్జంకిలో బుధవారం మహాసభలకు చెందిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నేత రూపేశ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధు, చరణ్, కృష్ణ, లక్ష్మణ్, పోచయ్య, కిష్టయ్య, బాబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ స్టడీ మెటీరియల్ అందజేత

మద్దూరు(హుస్నాబాద్): పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి మండలానికి మంచిపేరు తీసుకురావాలని ఏఈఓ వరదరాజు సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు షిరిడీ సాయిబాబా టెంపుల్ ట్రస్ట్ హైదరాబాద్ సహకారంతో తాటి భూమయ్య స్టడీ మెటీరియల్ అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఈఓ మాట్లాడారు. హెచ్‌ఎం చంద్రశేఖర్‌శర్మ, ఉపాధ్యాయులు అంజయ్య పాల్గొన్నారు.

◆ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

సిద్దిపేటకమాన్: ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా జైలును న్యాయమూర్తి స్వాతిరెడ్డి బుధవారం సందర్శించారు. ఖైదీలకు కల్పిస్తున్న భోజన వసతుల గురించి జైలు సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. వంటలను పరిశీలించారు. ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలని, అందరికీ అడ్వొకేట్స్ సౌకర్యం ఉండాలని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు 70 సంవత్సరాలు పైబడిన ఖైదీలకు, తీవ్ర అనారోగ్య ఖైదీలకు మెరుగైన సదుపాయాలను కల్పించాలని జైలు సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వికాస్, శరత్‌బాబు, వెంకటేశ్, రాజ్యలక్ష్మి, శ్రావణి, లక్ష్మీ నర్సయ్య పాల్గొన్నారు.